పశువుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

జిల్లా పశువర్ధక శాఖ అధికారి మురళి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 29వ తేదీన బక్రీదు పండుగను పురస్కరించుకుని జిల్లాలో పశువులను వధించినా, అక్రమ రవాణా చేసినా చట్టరీత్యా నేరమని జిల్లా పశువర్ధక శాఖ, జిల్లా జంతు సంక్షేమ సంఘం అధికారి కె.మురళీకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట వ్యతిరేకంగా ఏవిధమైన రవాణా జంతు వధలు చేయకూడదని పేర్కొన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం సభ్యులు, పోలీస్, మార్కెటింగ్, పంచాయతీ, రవాణా, పశుసంవర్ధక శాఖ అధికారులందరూ సమన్వయంతో వంటి చర్యలను నిరోధించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గా పద్మశ్రీ

ప్రమాణస్వీకారం చేస్తున్న గంటా పద్మశ్రీ

- 22 ఏళ్ల తర్వాత జిల్లా ప్రథమ పౌరురాలిగా మహిళ
- 47 మందికిగాను 35 మంది జెడ్‌పిటిసిలు సమావేశానికి హాజరు
- పద్మశ్రీతో ప్రమాణస్వీకారం చేయించిన కలెక్టర్
- మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులంతా హాజరు
- పోలీసుల తీరుతో మీడియా ప్రతినిధులకు తీవ్ర ఇబ్బందులు
- జెడ్‌పి సిఇఒ మార్పుపై అందరిలోనూ చర్చ?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ నూతన ఛైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 23 ఏళ్ల తర్వాత రెండో మహిళ ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో గురువారం ఉదయం 11 గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 47 మంది సభ్యులుండగా ప్రత్యేక సమావేశానికి 35 మంది సభ్యులే హాజరయ్యారు. కోరం ఉండటంతో ఎన్నిక నిర్వహణ సాగింది. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గా పద్మశ్రీ పేరును ద్వారకాతిరుమల జెడ్‌పిటిసి చిగురుపల్లి శామ్యూల్ ప్రతిపాదించగా దెందులూరు జెడ్‌పిటిసి నిట్టా లీలా నవకాంతం బలపరిచారు. ముందుగానే వైసిపి అధిష్ఠానం పద్మశ్రీని జెడ్‌పి ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేస్తూ బి.ఫారం ఇవ్వడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన పద్మశ్రీతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించి అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ప్రత్యేక సమావేశ హాలులోకి జెడ్‌పిటిసి సభ్యులను మాత్రమే అనుమతించారు. ఎన్నిక ప్రక్రియ మొత్తం అరగంట వ్యవధిలోనే ముగిసింది. ఎన్నిక అనంతరం ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఛైర్‌పర్సన్ ఎన్నిక కార్యక్రమానికి మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, ఎంపీలు కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌సిలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్ర, ఎంఎల్‌ఎలు ఆళ్ల నాని, కొఠారు అబ్బాయిచౌదరి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, జడ్‌పిటిసి సభ్యులు, ప్రముఖులు నూతనంగా ఎన్నికైన ఛైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో పార్టీ సమావేశం ఏర్పాటు చేసి ఛైర్మన్ ఎంపిక, ప్రభుత్వ పథకాలపైనా నాయకులు ప్రసంగించారు. 1995 నుంచి 2000వ సంవత్సరం వరకూ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ఇమ్మణ్ణి రాజేశ్వరి పనిచేశారు. ఆ తర్వాత ఇంత కాలానికి ఛైర్‌పర్సన్‌గా పద్మశ్రీ ఎన్నికయ్యారు.

అభివాదం చేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

పద్మశ్రీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న హోంమంత్రి వనిత

బైక్ ర్యాలీగా జిల్లా పరిషత్‌కు పద్మశ్రీ

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ముందుగానే పద్మశ్రీ పేరు ఖరారు కావడంతో గురువారం జరగనున్న ఎన్నికకు పెదపాడు నుంచి బైక్ ర్యాలీతో ఆమె బయలుదేరారు. ఈ ర్యాలీలో పెద్దఎత్తున వైసిపి కార్యకర్తలు, వారి శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. వంగాయగూడెం సెంటర్‌లో పద్మశ్రీని సత్కరించి అంతా శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుని సమావేశంలో పాల్గొన్నారు. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రానికి తరలిరావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

పద్మశ్రీకి అభినందనలు తెలుపుతున్న ఎంఎల్‌ఎలు, మంత్రి, కలెక్టర్

గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్బంధాలు

జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక సమయంలో గతంలో ఎన్నడూ లేని ఆంక్షలను ఈసారి అధికారులు అమలు చేశారు. జిల్లా పరిషత్ సిఇఒ ఆదేశాలంటూ పోలీసులు ఓవరాక్షన్ చేశారు. 10.30 గంటల తర్వాత మీడియాను సైతం సమావేశ మందిరంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. సమాచార శాఖాధికారి వచ్చి చెప్పినా పోలీసులు వినని పరిస్థితి నెలకొంది. జెడ్‌సి సిఇఒ ఆదేశాలంటూ ఖరాఖండిగా చెప్పారు. దీంతో చాలామంది మీడియా సిబ్బంది హాలు బయటే ఉండిపోవాల్సిన వచ్చింది. జెడ్‌పిలో గత కొంతకాలంగా జరుగుతున్న ఏకపక్ష పాలనకు నిదర్శనం గురువారం జరిగిన ఘటనలంటూ సర్వత్రా చర్చ సాగింది.



పద్మశ్రీకి పుష్పగుచ్ఛ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సిఇఒ మార్పుపై తీవ్ర చర్చ..?

జిల్లా పరిషత్ నూతన ఛైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఎన్నిక కావడంతో జెడ్‌పిటిసిల్లోనూ, అక్కడకు వచ్చిన రాజకీయ నాయకుల్లో సిఇఒ మార్పుపై తీవ్ర చర్చ సాగింది. కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్‌గా ఎన్నికయ్యే నాటికి జెడ్‌పి సిఇఒగా హరిహరనాథ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హరిహరనాథ్‌కు మంచి అధికారిగా పేరుకూడా ఉంది. కవురు శ్రీనివాస్ ఛైర్మన్ అయిన కొద్దికాలానికే ఆయనను జెడ్‌పి సిఇఒ బాధ్యతల నుంచి బదిలీ చేశారు. ఆయన స్థానంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒగా ఉన్న రవికుమార్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. దీనిపై అప్పట్లో తీవ్ర చర్చ సాగింది. వీరవాసరం ఎంపిపిగా కవురు శ్రీనివాస్ ఉన్నప్పుడు ఎంపిడిఒగా పని చేసిన రవికుమార్‌ను సిఇఒగా నియమించడం చర్చనీయాంశమైంది. వారిద్దరి మధ్య సాన్నిహిత్యంతోనే సిఇఒగా రవికుమార్‌ను నియమించినట్లు చర్చ సాగింది. నాటి నుంచి జిల్లా పరిషత్ పాలనపై తీవ్ర విమర్శలు విన్పిస్తూనే ఉన్నాయి. ఛైర్మన్ నామమాత్రంగా మారారని, అన్నీ సిఇఒ కనుసన్నల్లోనే జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజాప్రతినిధులుగా తమకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదంటూ జిల్లా పరిషత్ సమావేశాల్లో జెడ్‌పిటిసిలే వాగ్వివాదానికి దిగిన ఘటనలు నెలకొన్నాయి. నిధుల మంజూరు విషయంలో ఛైర్మన్ అనుమతించినా సిఇఒ అడ్డుకుంటున్నారంటూ జెడ్‌పిటిసిలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. జిల్లా పరిషత్ అధికారుల్లో సైతం సిఇఒ తీరుపై తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సిఇఒ ఏకపక్ష తీరుతో వ్యవహరిస్తారనే విమర్శలు ఉన్నాయి. జెడ్‌పి సమావేశాలు జరిపే తీరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొత్త ఛైర్మన్ రాకతో సిఇఒ బదిలీ ఖాయమనే ప్రచారం సాగుతోంది. సిఇఒను బదిలీ చేస్తేనే జిల్లా పరిషత్ ప్రక్షాళన అయ్యే అవకాశం ఉందని గురువారం సమావేశ ప్రాంగణంలో తీవ్ర చర్చ సాగింది.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రభుత్వానివి మోసపూరిత హామీలు

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నేతల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి ఎన్నికల ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు మోసపూరిత హామీలిచ్చి అధికారం చేపట్టాక ప్రభుత్వం మోసం చేసిందని రాష్ట్ర ఫ్యాప్టో కో ఛైర్మన్ కె.నరహరి విమర్శించారు. ఫ్యాప్టో దశలవారీ పోరాటంలో భాగంగా జిల్లా, రాష్ట్ర ఫ్యాప్టో కమిటీల ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దుచేసి పిఆర్‌సి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారం చేపట్టాక మాట మార్చిందని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ సాయి శ్రీనివాస్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ జవహర్లాల్ రాజు మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతోందని, ప్రతిపక్షంలో ఉండగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జగన్ వరాల జల్లు కురిపించారన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉండగా 154 నియోజకవర్గాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లు పోస్టల్ బ్యాలెట్‌తో అత్యధిక మెజార్టీతో గెలుపొందారని గుర్తుచేశారు. అధికారం చేపట్టగా మాట మార్చి మడం తిప్పారని విమర్శించారు. ఇపిఎస్‌ను రద్దు చేయకుండా ఒపిఎస్‌కు వెళ్లనీయకుండా ప్రస్తుతం జిపిఎస్ ఇస్తామనడం దుర్మార్గమన్నారు. ఒపిఎస్‌లో జీతభత్యాలు తీసుకుంటున్న రాష్ట్రంలో ఉన్న మంత్రులు ఎంఎల్‌ఎలంతా జిపిఎస్ పరిధిలోకి రావాలన్నారు. మెరుగైన పెన్షన్ ప్రధానమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం అత్యంత దారుణమన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ దామోదర్, ఎపిటిఎఫ్ అధ్యక్షులు ప్రకాశం, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామచంద్రరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి రామభద్రం పాల్గొన్నారు.

టిడిపి ప్రజాప్రతినిధులకు దెబ్బలు చూపుతున్న బాధితుడు

బాధితులకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలం చించినాడ గ్రామంలో దళితులకు చెందిన పెరుగులంక భూముల నుంచి వైసిపి నాయకులు చేస్తున్న అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్నారనే కారణంతో ఇటీవల పోలీసుల లాఠీఛార్జీలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటివద్ద వైద్యం పొందుతున్న దళితులు పల్లేరు శ్రీనివాసు, రాపాక బొజ్జమ్మ, తెన్నేటి స్టాలిన్‌ను గురువారం పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, పీతల సుజాత, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై వైసిపి ప్రభుత్వం పోలీసుల చేత విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయించి రక్తం కారే విధంగా తలలు పగలగొట్టి, మహిళల చాతిపై బూటు కాలితో తన్ని తీవ్రంగా గాయపర్చడం అత్యంత హేయమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అనంతరం బాధితులకు ధైర్యం చెప్పారు. వారి వంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉపాధి కూలీల పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి - పెంటపాడు

ఉపాధి కూలీల పొట్టకొట్టొద్దని వ్యవసాయ, రైతు సంఘం, సిఐటియు నేతలు కేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జట్లపాలెం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశానికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో కూలీలు నేతల వద్ద గోడు వెల్లబోసుకున్నారు. మూడు వారాల నుంచి పనిచేస్తున్నా ఈ రోజుకు కూడా డబ్బులు రాలేదని తెలిపారు. పని ప్రదేశాల్లో గతంలో ఇచ్చిన సౌకర్యాలు ఇప్పుడు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పూటలా పని విధానం చాలా ఇబ్బందిగా ఉందని, ఉపాధి పనుల్లో చదువుకున్న యువతీ యువకులు ఎక్కువమంది ఉన్నారని, పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పనికి బడ్జెట్లో నిధులు తక్కువ కేటాయిస్తోందన్నారు. రెండు పూటలా మస్తరు విధానం తీసుకొచ్చింది మోడీ అని, రెండు పూటలా మస్తరు వల్ల ఉపాధి కూలీలు వడదెబ్బకు తట్టుకోలేక పనికి రాలేమని చెప్పించే విధంగా ఈ విధానాలు తీసుకొచ్చారని తెలిపారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు గ్యాస్, పెట్రోల్ తదితర ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ ధరలకు అనుగుణంగా రోజు వేతనం 272 రూపాయలు కూలి ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ధరలకు అనుగుణంగా కూలి రేట్లు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు పూటలా మస్తరు విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, ఉపాధి కూలీలు అబ్బులు రామలక్ష్మి, సరస్వతి, అప్పల నరసమ్మ, రాము, సన్యాసిరావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నేతలు

దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

నిరసన దీక్షకు టిడిపి సంఘీభావం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో దళితుల పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, పీతల సుజాత, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలకు పుట్టినిల్లు అయిన చించినాడ గ్రామంలో దళితులకు అండగా నిలిచిన పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడును అక్రమంగా అరెస్టు చేసి పోలీసుల చేత వైసిపి ప్రభుత్వం దళితులపై దాడి చేయించిన అన్యాయాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినుమడింప చేస్తామని తెలిపారు. చించినాడ గ్రామంలో అక్రమ మట్టి తరలింపు ఆపే వరకూ అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి కూడా సిద్ధంగా ఉన్నామని, టిడిపి రాష్ట్ర అధిష్టానం నలుగురు కమిటీ సభ్యులు గొల్లపల్లి సూర్యారావు, పీతల సుజాత, వంగలపూడి అనిత, పిల్లి మాణిక్యాలరావులను చించినాడ పెరుగలంకలపై నిజనిర్ధారణ కమిటీ సభ్యులుగా నియమించడం జరిగిందని తెలిపారు. పేదలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని తెలిపారు. అనంతరం పెరుగులంకల పరిశీలనకై బయలుదేరిన టిడిపి నాయకులను పోలీసులు అడ్డగించారు. దీంతో అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన నాయకులు ఎవరైతే అక్రమ మట్టి తరలింపుకు సహకరిస్తున్నారో వారందరినీ కూడా రాబోయే రోజుల్లో కోర్టు గుమ్మం తొక్కిస్తామని, మరో ఎనిమిది నెలల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. చించినాడ గ్రామంలో పెరుగులంక భూములను పేదలందరికీ పంచి, పట్టాలను సైతం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా, మండల నాయకులతో పాటు టిడిపి శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

టిడిపి నాయకులను అడ్డగించిన పోలీసులు

రీ సర్వే పనుల వేగవంతానికి చర్యలు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే పనులు వేగవంతంగా చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం వంటి అంశాలపై సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి కె.జాషువా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రెండో దశలో సర్వే ఆఫ్ ఇండియా నుంచి 86 గ్రామాలకు మ్యాప్‌లు వచ్చాయని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాకు ఇంకా 188 గ్రామాలకు సర్వే ఆఫ్ ఇండియా నుంచి మ్యాపులు రావాల్సి ఉందని, ఎంత తొందరగా వస్తే అంత త్వరగా రెండో దశ రీ సర్వే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి

కౌలు రైతుల చట్టాన్ని సవరించాలని ధర్నా

ప్రజాశక్తి - గణపవరం

కౌలు రైతుల చట్టాన్ని సవరించి భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని గురువారం కౌలు రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కేశవరం రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం జిల్లా నాయకులు పి.నరసింహమూర్తి మాట్లాడుతూ వ్యవసాయంలో 70 శాతం భూమిని కౌలురైతులే సాగుచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2011 కౌలు చట్టాన్ని రద్దు చేసి పంట సాగు హక్కు తప్పనిసరి చేయడంతో ఎక్కువ మంది కౌలు రైతులకు కౌలు కార్డులు రాకపోవడం వల్ల బ్యాంకు రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం, చివరికి పంట అమ్ముకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్డులు లేకపోవడం వల్ల వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునేది కౌలు రైతులేనని తెలిపారు. ప్రభుత్వం గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి కార్డులందించాలన్నారు. కేరళ ప్రభుత్వం తరహాలో రుణవిముక్తి చట్టాన్ని చేసి కౌలు సన్న, చిన్నకారు రైతులకు రుణాలు రద్దు చేయాలని కోరారు. ధర్నా అనంతరం వ్యవసాయ సహాయకులు ఎం.వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సంఘం మండల కమిటీ అధ్యక్షులు బసవ ఎర్రి నాయుడు, నాయకులు దొంగ సత్యనారాయణ, ఎం.వెంకటరావు, రైతులు ఎస్.సంజీవరావు, పేట లక్ష్మణరావు, జోగి సత్యనారాయణ కౌరు రామచందరావు పాల్గొన్నారు.

కేశవరం రైతు భరోసా కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

పోడూరులో మజ్జిగ పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ

50 రోజుల పాటు చలివేంద్రం నిర్వహణ

ప్రజాశక్తి - ఆచంట

వేసవి నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ఆచంట కచేరీ సెంటర్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి 50 రోజుల పాటు సుదీర్ఘంగా ప్రయాణికులకు, బాటసారులకు తమ సేవలందించామని ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రయాణికులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వేసవిలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆచంట ప్రజలు, ప్రయాణికులు ఈ మజ్జిగ చలివేంద్రాన్ని 50 రోజులు సద్వినియోగం చేసుకున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది చేసిన సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి అడ్డాల పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోడూరు : పోడూరులో ఆర్అండ్బి రహదారి మార్గంలో సీతారామ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఏజెన్సీ అధినేత పసుమర్తి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఎండల వల్ల దాహంతో అల్లాడుతున్నారని తెలిపారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు గత 50 రోజులుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులంతా చలివేంద్రం సేవలను వినియోగించుకోవాలని లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది కడలి సూర్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, కె.సుభద్ర, కె.వినాయక, బిఎండి ప్రసాద్ పాల్గొన్నారు.


ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేష్

పండితవిల్లూరు ఉపసర్పంచిగా వెంకటేష్

ప్రజాశక్తి - పోడూరు

పండిత విల్లూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచిగా 10వ వార్డు సభ్యుడు సదమల్ల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకు ముందు ఉప సర్పంచిగా ఉన్న 2వ వార్డు సభ్యురాలు పినిపే సుమజా ఉపసర్పంచి పదవికి ఇటీవలే రాజీనామా చేయడంతో ఉపసర్పంచి ఎన్నిక అనివార్యమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి సిఎస్వి రెడ్డి సమక్షంలో ఉపసర్పంచి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను ఉపసర్పంచిగా ఎన్నుకున్న సందర్భంగా గ్రామ సర్పంచి ఇళ్ల లక్ష్మీ చంద్రికకు సహచర వార్డు సభ్యులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచిగా ఎన్నికైన తాను సర్పంచి లక్ష్మీ చంద్రిక, వార్డు సభ్యులతో కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉప సర్పంచిగా ఎన్నికైన వెంకటేష్ను గ్రామ సర్పంచి లక్ష్మీ చంద్రిక, సొసైటీ ఛైర్మన్ గెద్దాడ ఏకలవ్య, పంచాయతీ కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి, ఇళ్ల శ్రీనివాస్, కొమ్మూరి నాగబాబు అభినందించారు.


ఆసుపత్రికి బహూకరించిన సామగ్రితో వైద్యసిబ్బంది

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆరోగ్య కేంద్రంలో సేవలను గుర్తించి దాతలు సహకరించడం అభినందనీయమని భట్లమగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు ఎం.గంగునాయుడు అన్నారు. ఆరోగ్య కేంద్రంలో సర్వీస్ విభాగంలో జరిగే సులభ కాన్పుల్లో జిల్లాలో మంచి సర్వీస్ అందించినందుకు గురువారం కేంద్రానికి దాతలు ఆసుపత్రికి సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్డిఎస్ ఛైర్మన్ కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి గణపవరం మండలానికి చెందిన చింతలపాటి సూర్యనారాయణ రాజు జ్ఞాపకంగా ఆయన కుమార్తె, కుమారుడు ఆరోగ్య కేంద్రంలో ఐసియు బెడ్, ఐదు సీలింగ్ ఫ్యాన్లు, 5 తలగడలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొడాలి ప్రదీప్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్ప గ్రామంలో మైనింగ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో అక్రమంగా తవ్వుతున్న ఇసుక తవ్వకాలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా మైనింగ్ జియాలజీ శాఖ రాయల్టీ ఇన్స్పెక్టర్ కెవి.రమణ, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్కుమార్లు తవ్వకాలు పరిశీలించి ఎంతమేరకు తవ్వకాలు నిర్వహించారనే విషయాలను నమోదు చేశారు. వారితో పాటు విఆర్ఒ సుజాత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం మత్తులో గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

మద్యం మత్తులో వ్యక్తి గడ్డి మందు తాగి మృతి చెందిన ఘటన ఉండి మండలంలోని చినపుల్లేరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపుల్లేరు గ్రామానికి చెందిన సాగిరాజు సూర్యనారాయణ రాజు (43) వెల్డింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మద్యం మత్తులో వెల్డింగ్ దుకాణంలోనే ఉన్న గడ్డి మందు తాగి స్పృహ కోల్పోగా తండ్రి సాగిరాజు వెంకట్రాజు భీమవరం హాస్పిటల్కు తరలించారు. పరీక్షించిన వైద్యులు సూర్యనారాయణరాజు చనిపోయినట్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సూర్యనారాయణ రాజు తండ్రి వెంకట్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మృగశిర ఆరంభం..

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మృగశిర కార్తె ప్రారంభం కావడంతో గురువారం ఆకాశం మేఘావృతమైంది. దీంతో స్వల్పంగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈ కార్తె రోజు ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక ఆరోగ్య రహస్యం దాగి ఉంది. రోళ్ల పగిలే ఎండలను మోసుకొచ్చిన రోహిణీ కార్తె ముగిసి చల్లబర్చే మృగశిర మొదలైంది. మృగశిర కార్తెలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించి నాటి నుంచి నైరుతి రుతుపనాలు వస్తాయని పెద్దలంటారు. వాతావరణం ఒక్కసారి చల్లబడడం, ప్రకృతిలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ నేపథ్యంలో అనేక రకాల సూక్ష్మక్రిములు పునరుత్పత్తి అవుతాయి. మానవునిలో రోగ నిరోధకశక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి.

వంకతాళ్లచెరువు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - ఆచంట

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచి సరోజినీ వెంకటేశ్వరరావు

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఆచంట పంచాయతీ పరిధి వంకతాళ్లచెరువు పంచాయతీ రాజ్ రోడ్డుకు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు చొరవతో నేటికి మోక్షం కలిగింది. ఈ సందర్భంగా గురువారం ఉదయం రూ.15 లక్షలతో నిర్మించనున్న రహదారి పనులను సర్పంచి సరోజినీ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రోడ్డు కల నేటికి నెరవేరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జగన్నాథరావు, ఎంపిటిసి జ్యోతి రామాంజనేయులు, కుక్కల కిరణ్, గెద్దాడ విశ్వేశ్వరరావు, కామన హరిబాబు, బండి మహేష్, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు జెడ్పి ఉన్నత పాఠశాల

ప్రధానోపాధ్యాయులుగా రవిశంకర్ సర్కార్

ప్రజాశక్తి - మొగల్తూరు


బాధ్యతలు స్వీకరిస్తున్న రవిశంకర్ సర్కార్

మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వర్ధమాని రవిశంకర్ సర్కార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం గ్రామీణ మండలం మత్స్యపురిలోని జెడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మొగల్తూరులోని జెడ్పి ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. తాను చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయులుగా రావడం తనకు ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల హాజరు శాతం, ఉత్తీర్ణతాశాతం పెంచడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ఎస్విఆర్.మూర్తి రాజు పాలకొల్లు మండలం అరటికట్లలోని జెడ్పి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రవిశంకర్ సర్కార్కు పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

హామీ అమలు ఘనత జగన్దే : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బందికి ఇక నుండి ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పదేళ్లుగా ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ట్రెజరీ ద్వారా జీతాల చెల్లింపునకు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటివరకూ వీరికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతాలు చెల్లింపులు జరుగుతున్నాయని, ఇక నుండి ద్వారా జీతాలు ట్రెజరీ ద్వారా చెల్లింపు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి జిల్లా డిసిఎస్ అధికారి వీరాస్వామి, వైద్యులు డాక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్, డాక్టర్ మాధవి కళ్యాణ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పద్మ, స్టాఫ్ నర్స్ సత్యవతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వలవల బాబ్జి

'చంద్రబాబు మేనిఫెస్టో హర్షదాయకం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవిష్యత్తుకు భరోసా ఇస్తూ మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన పథకాలను గ్రామస్థాయి వరకూ ఏ విధంగా తీసుకెళ్లాలి అనే అంశంపై విస్తృత స్థాయి సమావేశం గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టో హర్షదాయకంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్రెడ్డిని గద్దె దింపడం ఖాయమన్నారు. 2024 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం సీటు టిడిపిదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ విభాగాల్లో నియమితులైన సభ్యులందరూ గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి టిడిపి గెలుపునకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, ముత్యాల సత్యనారాయణ, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో రాయబారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 11, 12 తేదీల్లో మంగళగిరి సిసిఎల్ కార్యాలయం వద్ద రాయబారం చేస్తున్నట్లు కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ తెలిపారు. గురువారం ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేతా గోపాలన్ మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి భూ యజమాని సంతకం తప్పనిసరి నిబంధనను తొలగించాలని గోపాలన్ డిమాండ్ చేశారు. రాయబారంలో కౌలు రైతులందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి కోటేశ్వరరావు, దొంగ సత్యనారాయణ, జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గురువారం పెనుగొండలో పితాని వెంకన్న, చంద్రమ్మ కమ్యూనిటీ హాల్లో నాగిశెట్టి గంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈ నాలుగేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా 12, 14 రెండు రకాల మెమోలను విడుదల చేసి సంక్షేమ బోర్డు అమలును నిలిపి వేయించిందని విమర్శించారు. తక్షణం ఆ మెమోలను రద్దు చేయాలని, రాజ్యాంగపరంగా ఏర్పడిన సంక్షేమ బోర్డు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 లక్షల భవన నిర్మాణ కుటుంబాలకు ఖర్చు చేయాల్సిన 1240 కోట్ల రూపాయలను సంక్షేమ బోర్డు నుంచి ప్రభుత్వం తన అవసరాలకు మళ్లించిందని, ఆ డబ్బులను వెంటనే సంక్షేమ బోర్డుకు జమచేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో కార్మికులకు బకాయి పడ్డ రూ.35 కోట్లను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు, నాయకులు ఎర్రంశెట్టి సుబ్బరాజు, దూలం ప్రసాద్, కంబాల ఆదినారాయణ, చలుమూరి శ్రీనివాసరావు, నరసింహారావు పాల్గొన్నారు.

మొగల్తూరు చేరుకున్న సైకిల్ యాత్ర

ఇప్పటివరకు 11 రాష్ట్రాల్లో పర్యటించిన కర్ణాటకకు చెందిన విజయ్గోపాలకృష్ణ

ప్రజాశక్తి - మొగల్తూరు

సైకిల్ యాత్ర చేస్తున్న విజయ్గోపాలకృష్ణ

జల, జంతు, వన సంరక్షణ నినాదంతో నెలల తరబడి సైకిల్ యాత్ర చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరుకు చెందిన చాత్రాతి విజయ్ గోపాల కృష్ణ సైకిల్ యాత్ర చేస్తూ తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం మీదుగా గురువారం మొగల్తూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలుదేరి ఇప్పటి వరకు 11 రాష్ట్రాల్లో పర్యటించానని, ఉదయం పర్యటన మొదలు పెడుతూ మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకుంటానని, రాత్రి పూట దేవాలయం లేదా అనువైన ప్రదేశంలో విశ్రాంతి తీసుకుంటానన్నారు. ఇప్పటివరకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, నర్మదానది, నాందేడ్, త్రివేణి సంగమం, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, మధుర, హ్యాయానా, పంబాజ్, సింధూ నది ప్రాంతాల్లో పర్యటించానన్నారు. తన యాత్ర కన్యాకుమారి వరకు సాగుతుందని, ఇప్పటివరకు సుమారు 480 రోజులు సైకిల్ యాత్ర చేశానని, మరో 70 రోజుల్లో తన యాత్ర పూర్తవుతుందని చెప్పారు. తమ పూర్వీకులది ఇదే జిల్లాలోని తణుకు మండలంలోని కొమరవరం గ్రామమని, 1971లో రాయచూర్కు వెళ్లి స్థిరపడ్డామన్నారు. తన పర్యటనలో ఏగ్రామం వెళ్లినా గ్రామస్తులు ఆదరాభిమానాలు చూపుతున్నారని, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నూజివీడులో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మామిడి రైతులు

అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఏటా నష్టపోతున్న మామిడి రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాలి పోయిన, దెబ్బ తిన్న మామిడి కాయలను కొను గోలు చేసి పౌడర్ తయారు చేసే ప్రాసెసింగ్ యూనిట్ను రూ.5 కోట్ల వ్యయంతో నూజివీడులో ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమలో వెయ్యి మంది మహిళలకు రూ.50 లక్షల భాగస్వామ్యం కల్పించి మిగిలిన మొత్తాన్ని రాయితీ ఇవ్వనుంది. దీనివల్ల ఏలూరు, కృష్ణా జిల్లాల మామిడి రైతులకు లబ్ధి చేకూరనుంది.

ప్రతి పేదవానికి సొంత ఇల్లు : మంత్రి వనిత

ప్రజాశక్తి - తణుకు రూరల్


ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి వనిత

ప్రతి పేదవాని సొంత ఇంటి కల సిఎం జగన్ మోహన్ రెడ్డి నిజం చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. తణుకు మండలంలోని దువ్వ గ్రామంలో జగనన్న కాలనీలో కోలపల్లి ఉమా శిరీష శివప్రసాద్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో ఇంటిని సమకూర్చుకున్నామని లబ్ధిదారులు ఆనం దాన్ని వ్యక్తం చేశారు. అనంతరం హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ప్రతి పేదవాని సొంత ఇంటి కల సిఎం జగన్ మోహన్ రెడ్డి ద్వారా మాత్రమే సాధ్యమ న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇంటిని ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల పేరిట ఇంటి పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇల్లు నిర్మించుకోవడానికి తగిన ఆర్థిక సహాయం ఉచితంగా జగనన్న ప్రభుత్వమే అందిస్తుందన్నారు. దువ్వ జగనన్న కాలనీలో మొత్తం 731 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, వాటిలో 600కి పైగా ఇల్లు ఇప్పటికే పూర్తయ్యాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హోంమంత్రికి వివరించారు.

విద్యార్థులకు చెస్ పోటీలు

పాలకొల్లు :పాలకొల్లు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు బొమ్మల తయారీ, జిఎస్ఎల్వి ఉపగ్రహం నమూనా నేర్పించారు. అనంతరం క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. 35 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల వారి పోటీలు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీన నిర్వహించే సభలో బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి వి.శాంతకుమారి తెలిపారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

పాలకోడేరు :మండలంలోని కొండేపుడిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ టివి.రాజేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్లను పరిశీలించిన ఆయన పనులకు వచ్చినవారికి కంటే మస్టర్లో హాజరు సంఖ్య ఎక్కువగా ఆరా తీశారు. కొందరు కూలీలు ముందుగానే వెళ్లిపోయారని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో టిఎ చిట్టి జై బాబు ఉన్నారు.

జిఎస్టి అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపి పాలెంలోని ఒక కాంట్రాక్టర్ కార్యాలయంలో జిఎస్టి అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆ కాంట్రాక్టర్ చేసిన పనికి సంబంధించి 18 శాతం జిఎస్టి నిధులను సంబంధిత శాఖకు చెల్లించింది లేనిది తెలుసుకునేందుకు విజయవాడ నుంచి వచ్చిన అధికార బృందం తనిఖీల నిర్వహించి పలు రికార్డులను వారితో పాటు తీసుకెళ్లారు. ఈ నెల 12న విజయవాడలోని ఎపిఎస్ ఆర్డిఐ కార్యాలయానికి కాంట్రాక్టర్ రికార్డులతో హాజరు కావాలని సూచించారు. దీనికి సంబంధించి వివరాలను అధికారులు వెల్లడించలేదు.

నేడు గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు పిహెచ్సిలో ఈ నెల 9వ తేదీన గర్భిణులకు పౌష్టికాహారం అందించనున్నట్లు డాక్టర్ కె.కార్తీక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌష్టికాహారాన్ని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు చేతుల మీదుగా అందించడం జరుగుతుందని తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.

డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యాత్రికులకు అన్నదానం చేయడం పూర్వ జన్మ సుకృతమని లయన్ పడాల కావ్యారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కోతి బొమ్మ సెంటర్లో షిర్డీ సాయి మందిరం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లయన్ మోటూరి వెంకటరత్నం చాముండేస్వరి దేవీ దంపతుల సౌజన్యంతో యాత్రికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అతిథిగా విచ్చేసిన డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ పడాల కావ్యారెడ్డి యాత్రికులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మోటూరి వెంకటరత్నం, లియో క్లబ్ అధ్యక్షురాలు లియో మాధురి ఆలయ కమిటీ సభ్యులు తాళ్ల సూరిబాబు మాట్లాడారు. అనంతరం ఆలయ కమిటీ దాతలు మోటూరు వెంకట రత్నం దంపతులను సత్కరించారు. లయన్స్ క్లబ్, లియో క్లబ్, ఆలయ కమిటీ సభ్యులు సేవలందించారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, తాడేరు గ్రామానికి చెందిన బెల్లంకొండ సత్యనారాయణ, S/o. నరసింహారావు అను నేను **దస్తావేజు నెంబరు 3453/2010** గల ఒరిజినల్ దస్తావేజులు తీసుకొని ది. 05-6-2023వ తేదీన తాడేరు నుండి భీమవరం రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చి లేఖరు గారికి జిరాక్సు తీయించి ఇచ్చి సదరు లింకు డాక్యుమెంట్లు, ఒరిజినల్ దస్తావేజులను తీసుకొని భీమవరం నుండి తాడేరు గ్రామంనకు బైకుపై వెళ్తుండగా మార్గమధ్యలో జారి పడిపోయినవి. కావున ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింద అడ్రసుకు తెలియజేయవలెను.

బెల్లంకొండ సత్యనారాయణ
S/o. నరసింహారావు
తాడేరు గ్రామం, భీమవరం మండలం
సెల్: 8074984417

In the Court of the Hon'ble 1st Addl. District Judge, Eluru
Crl. Appeal No. 41/2018

Between:
Dr. Karumuri Venkata Nageswara Rao
...Appellant/ D1 Complaint
AND
1. Ch.Ramoji Rao and Othes
...Respondents/ A1, A2
2. V.Satish (A2), Staff Reporter, Eenadu Daily News Paper, Hindu, Male, age, John Street, Narasimharao Pet, Eluru - 534006, West Godavari District.

పై నంబరు అప్పీల్లో రెస్పాండెంట్-2 అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా నోటీసు ఎన్నిసార్లు పంపినా మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు వాదన నిమిత్తం **ది. 20-06-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10.30 ని||లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.వి.కృష్ణారెడ్డి, అడ్వకేట్
ఏలూరు, సెల్: 9848689999

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తాడేపల్లిగూడెం
I.P. 8/2014

Between:
షేక్ అహమద్ ఆలీ, S/o. సయ్యద్ బాజీ, వయస్సు 50 సం||లు, ముస్లిం, గణపవరం.
-పిటీషనర్/డెబ్టార్
Vs
రుద్రరాజు ఆంజనేయరాజు & అదర్స్
-రెస్పాండెంట్స్/ క్రెడిటర్
R-3: కంబాల శ్రీనివాసరావు, S/o. not known, హిందు, పురుషుడు, వయస్సు 50 సం||లు, భీమవరం.
R-4: ముంగర సంజీవకుమార్, S/o. కనక లింగేశ్వరరావు, హిందు, పురుషుడు, వయస్సు 50 సం||లు, ఏలూరు.

పిటీషనర్ తరుపు దాఖలు చేసిన పబ్లికేషన్ U/O 5, R-20 ప్రకారం

పై నెంబరు ఐ.పి. దావాలో ఫిర్యాది రెస్పాండెంట్ 3, 4లకు ఎన్నిసార్లు సమన్లు పంపినా రెస్పాండెంట్ R3, R4 లు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటకు నిరాకరించినందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము. పై కేసు నందు రెస్పాండెంట్లు అయిన మీరు పై కోర్టు వారి ఎదుట వాయిదా **ది. 27-6-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు** స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయి కేసు తాలూకా కాగితాలు స్వీకరించి సమాధానం తెలుపవలెను. లేని యెడల కోర్టు వారు మీపై పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేయుదురు అని ఇందుమూలముగా తెలియచేయుచున్నారు.

వాయిదా: ది. 27-6-2023 ఉదయం 10.30 ని||లకు

సమయం సత్య కిషోర్బాబు
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9392557279
ది.08-6-2023 7780177841

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 131-135/GGMP-Mpl.Funds & General/2023-24, Dated. 08-6-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of CC Road & Drains, Construction of Toilets, providing Brick Wall, and Providing Concrete Lineing to Road Side Marzines at various places in Municipal Corporation, Eluru"** Total No. of works is **5** with an amount of Rs. **32.52** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 09-06-2023. Last date of receipt of tenders is 15-06-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU